సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 7 । జూలై । 2023



యమపాశాలైన విద్యుత్ వైర్లు

మొగల్తూరు మండలం మోళ్లపర్రుకు చెందిన ఇద్దరు వ్యక్తులు విద్యుదాఘాతానికి బలయ్యారు. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. 8లో ▸



గంజాయిపై ఉక్కుపాదం

గంజాయి విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఏలూరు రేంజ్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 8లో ▸

చినవెంకన్నకు కాసుల పంట

ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి (చినవెంకన్న) ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 36 రోజులకు రూ.3,70,46,060 ఆదాయం సమకూరింది. 8లో



న్యూస్‌రీల్

హౌసింగ్ అధికారులకు పురస్కారాలు



రాష్ట్రస్థాయి అవార్డులు అందుకుంటున్న ఉంగుటూరు హౌసింగ్ డీఈ, ఏఈ

ఉంగుటూరు: ఉంగుటూరు మండల గృహ నిర్మాణ శాఖ డీఈ, ఏఈలకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు వరించాయి. హౌసింగ్ బోర్డు ఏర్పడి 45 ఏళ్లయిన సందర్భంగా జిల్లాకు ఇద్దరు చొప్పున ఉత్తమ అధికారులకు అవార్డులు అందించారు. ఈ క్రమంలో ఏలూరు జిల్లాకు సంబంధించి డీఈ సోమేశ్వరరావు, ఏఈ సురేష్‌బాబుకు అధికారులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 2,600 ఇళ్ల నిర్మాణాలకు 2,000 ఇళ్లు ప్రారంభించామన్నారు. వీటిలో 1,600 ఇళ్లు ఉంగుటూరు కాలనీలో ఉండగా, ఇక్కడ ఆర్చి నిర్మాణం చేసి పూర్తి చేయించడంతో తమను అవార్డుకు ఎంపిక చేశారని చెప్పారు.

హౌసింగ్ డీఈకి అభినందనలు

పెంటపాడు: ఇల్లులేని ప్రతి పేదవాడికీ రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న గృహ నిర్మాణం చేరువకావాలని, ఆ దిశగా హౌసింగ్ శాఖ కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గృహనిర్మాణ సంస్థ లక్ష్యంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన తాడేపల్లిగూడెం హౌసింగ్ శాఖ డీఈ ఏవీఎస్‌వీ ప్రసాద్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అవార్డు దక్కింది. సంస్థ 45వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో డీఈ ప్రసాద్ గృహ నిర్మాణంలో లక్ష్యాన్ని అధిగమించడంతో పురస్కారం అందుకున్నారు. గురువారం తాడేపల్లిగూడెంలో జరిగిన కార్యక్రమంలో డీఈ ప్రసాద్‌ను మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ప్రశాంతి అభినందించారు.

అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): అరుణాచలం యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోందని, భక్తుల నుంచి విశేష స్పందన రావడంతో మరిన్ని సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి తెలిపారు. ఈనెల 1న ప్రత్యేక బస్సులు వెళ్లి వచ్చాయని, మరలా ఈనెల 30న అరుణాచలం గిరి ప్రదక్షిణ దృష్ట్యా ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ప్రతి నెలా పౌర్ణమికి ముందు రోజు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి బస్సులు బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం చేరుకుని, అక్కడ గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి బయలుదేరుతాయన్నారు. హైటెక్ వీడియో కోచ్ బస్సులు, క్రమశిక్షణ, అనుభవం కలిగిన సిబ్బందిని ఏర్పాటుచేస్తున్నామని, తక్కువ చార్జీలకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు.

అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌పై అప్రమత్తం

సాక్షి, భీమవరం: ప్రభుత్వ పథకాల పేరుతో అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండి సమాధానమివ్వాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పవద్దని, ప్రభుత్వ అధికారులు పథకాల కోసం లబ్ధిదారులకు ఫోన్ చేసి ఖాతా వివరాలు అడగరనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు సరికొత్త మార్గాల్లో మోసం చేస్తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు, వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే స్థానిక పోలీసులకు, సైబర్ హెల్ప్‌లైన్ 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

ఇరగవరంలో అత్యధిక వర్షపాతం

సాక్షి, భీమవరం: జిల్లాలో గడిచిన 24 గంటల్లో ఇరగవరంలో 29.4 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 6 మి.మీ., పెంటపాడులో 15.4, తణుకులో 11.8, అత్తిలిలో 7.4, పెనుమంట్రలో 13.8. పెనుగొండలో 10, భీమవరంలో 12, నరసాపురంలో 11.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. మిగిలిన మండలాల్లో 2 మిల్లీమీటర్ల పైబడి వర్షపాతం నమోదైంది.

ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల(టీసీసీ) పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 36 మందికి 12 మంది, డ్రాయింగ్ హయ్యర్ పరీక్షకు 34 మందికి 28 మంది హాజరయ్యారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ రవిసాగర్ తెలిపారు.

రహదారులకు పెన్నిధి

ప్రగతి బాటలు

- రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు నిధులు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 11 రాష్ట్ర రహదారుల నిర్మాణం
- 35 జిల్లా రోడ్లకు మరమ్మతులు
- రూ.134.60 కోట్ల నిధుల మంజూరు



వీరవాసరం-పెనుమంట్ర రాష్ట్ర రహదారి

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్లు నాణ్యతా లోపంతో అధ్వానంగా మారగా.. నాలుగేళ్లుగా ప్రత్యేక శ్రద్ధతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విడతల వారీగా రహదారుల నిర్మాణం, మరమ్మతులకు నిధులు కేటాయించడంతో రాష్ట్రంలో పలు రోడ్లలో ప్రయాణం సాఫీగా సాగుతోంది. తాజాగా పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని రాష్ట్ర రహదారుల నిర్మాణం, జిల్లా రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.134.60 కోట్లు కేటాయించారు. వీటిలో 11 రాష్ట్ర రహదారుల నిర్మాణానికి సుమారు రూ.45 కోట్లు, 35 జిల్లా రోడ్ల మరమ్మతులకు రూ.89 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రహదారుల నిర్మాణం, మరమ్మతులకు త్వరలోనే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నాలుగు రోజుల్లో టెండర్లు పిలుస్తాం



పశ్చిమగోదావరి జిల్లాలో ఆరు రాష్ట్ర రహదారుల నిర్మాణం, 24 జిల్లా రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.81.60 కోట్లు మంజూరయ్యాయి. పనులను త్వరితగతిని పూర్తి చేయించడానికి నాలుగు రోజుల్లో టెండర్లు పిలుస్తాం. రోడ్లు నాణ్యతతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎస్.లోకేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, భీమవరం

'పశ్చిమ'లో రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు..

పశ్చిమగోదావరి జిల్లాలో ఆరు రాష్ట్ర రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.22.30 కోట్లు మంజూరు చేసింది.

- భీమవరం-దొంగపిండి మార్గంలో సుమారు 11 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లు.
- పెనుమంట్ర-వీరవాసరం మార్గంలో 6.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లు.
- కానూరు-లంకలకోడేరు మార్గంలో 6.3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.50 కోట్లు.
- కలవపూడి-గణపవరం, భీమవరం-పిప్పర మార్గంలో 7 కిలోమీటర్ల రోడ్డుకు రూ.4.60 కోట్లు.
- సిద్దాంతం-జుత్తిగ రోడ్డుకు రూ.2.20 కోట్లు.
- భీమవరం-పిప్పర రహదారిలో 3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

24 జిల్లా రహదారుల మరమ్మతులకు..

జిల్లాలోని 24 జిల్లా ప్రధాన రహదారుల్లో సుమారు 177 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.59.30 కోట్లు మంజూరయ్యాయి.

- కుమ్మరపాలెం-భీమలాపురం రోడ్డుకు రూ.1.50 కోట్లు.
- గుమ్ములూరు-భీమలాపురం రోడ్డుకు రూ.2.40 కోట్లు.
- లంకలకోడేరు-కొప్పర్రు రోడ్డుకు రూ.3 కోట్లు.
- కవిటం బ్రిడ్జి నుంచి గుమ్ములూరు రోడ్డుకు రూ.3 కోట్లు.
- పేరుపాలెం నుంచి వయా కొత్తకాయలతిప్ప మీదుగా మొగల్తూరు రోడ్డుకు రూ.కోటి.
- లంకలకోడేరు-కొప్పర్రు రోడ్డుకు రూ.1.20 కోట్లు.
- రుస్తుంబాద-కొప్పర్రు రోడ్డుకు రూ.1.50 కోట్లు.
- నరసాపురం-కరింశెట్టిపాలెం రోడ్డుకు రూ.3 కోట్లు.
- పంజావేమవరం- లంకలకోడేరు రోడ్డుకు రూ.2.50 కోట్లు.
- వీరవాసరం-మత్స్యపురి రోడ్డుకు రూ.6 కోట్లు.
- భీమవరం-ఎల్‌వీఎన్ పురం రోడ్డుకు రూ.3 కోట్లు.
- చినమిల్లిపాడు-మాలవానితిప్ప రోడ్డుకు రూ.2.50 కోట్లు.
- తాడేపల్లిగూడెం వద్ద విజయవాడ-విశాఖ పాత బైపాస్ రోడ్డుకు రూ.6.90 కోట్లు.
- తాడేపల్లిగూడెంలో సీజీ రోడ్డు-కోనాల రోడ్డుకు రూ.కోటి.
- కస్పాపెంటపాడు-గణపవరం రోడ్డుకు రూ.3 కోట్లు.
- దువ్వ-చిలకంపాడు రోడ్డుకు రూ.కోటి.
- మంచిలి-మోగల్లు రోడ్డుకు రూ.2.50 కోట్లు.
- యర్రాయిచెరువు-పి.వేమవరం రోడ్డుకు రూ.1.30 కోట్లు.
- కవిటంపాకల-మాలవానితిప్ప రోడ్డుకు రూ.2.80 కోట్లు.
- చిలుకూరు-గణపవరం రోడ్డుకు రూ.3 కోట్లు.
- తణుకు పట్టణ పరిధిలోని వీవీ రోడ్డు నుంచి టీబీ రోడ్డుకు రూ.1.70 కోట్లు.
- కొమరవరం-తూర్పు విప్పర్రు రోడ్డుకు రూ.1.50 కోట్లు.
- నరసాపురం-మొగల్తూరు రోడ్డులో పాతకాలువ సెంటర్ నుంచి కొప్పర్రు వరకు రూ.1.50 కోట్లు.
- గొల్లలకోడేరు-నవుదూరు రోడ్డుకు రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

ఏలూరు జిల్లాలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు..

ఏలూరు జిల్లాలో ఐదు రాష్ట్ర రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది

- ఉంగుటూరు నియోజకవర్గంలో చేబ్రోలు-ఉండి మార్గంలో 13.6 కిలోమీటర్ల రోడ్డుకు రూ.7.50 కోట్లు.
- చేబ్రోలు-దేవులపల్లి మార్గంలో 8.8 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.50 కోట్లు.
- చింతలపూడి నియోజకవర్గంలో ఏలూరు-మేడిశెట్టివారిపాలెం రోడ్డుకు 4.5 కిలోమీటర్లకు రూ.5 కోట్లు.
- కైకలూరు నియోజకవర్గంలోని ఏలూరు-కైకలూరు రహదారికి 3.6 కిలోమీటర్లకు రూ.3 కోట్లు.
- భీమవరం-గుడివాడ రోడ్డుకు 7.24 కిలోమీటర్లకు రూ.4 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

జిల్లా రహదారుల మరమ్మతులకు..

ఏలూరు జిల్లాలోని 11 జిల్లా రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

- ఏలూరు నియోజకవర్గంలోని మాదేపల్లి-ఏలూరు రోడ్డు 6 కిలోమీటర్లకు రూ.1.50 కోట్లు
- దెందులూరు నియోజకవర్గంలో వడ్డిగూడెం రోడ్డు 9.8 కిలోమీటర్లకు రూ.4.30 కోట్లు
- ఈపీ రోడ్డు వయా ముప్పర్రు రహదారికి 11.4 కిలోమీటర్లకు రూ.3 కోట్లు
- గోగుంట రోడ్డు 7 కిలోమీటర్లకు రూ.2 కోట్లు
- గోపన్నపాలెం-రామసింగారం రోడ్డుకు 5.2 కిలోమీటర్లకు రూ.3 కోట్లు
- ఉంగుటూరు నియోజకవర్గంలో భువనపల్లి-నిడమర్రు రోడ్డుకు 4 కిలోమీటర్లకు రూ.2 కోట్లు
- వల్లూరు-వీరేశ్వరపురం రోడ్డుకు 4.5 కిలోమీటర్లకు రూ.1.80 కోట్లు
- గణపవరం- పిప్పర రోడ్డుకు 3.3 కిలోమీటర్లకు రూ.1.04 కోట్లు
- గుండుగొలను- ఆగడాలలంక రోడ్డుకు 2.2 కిలోమీటర్లకు రూ.కోటి
- పోలవరం నియోజకవర్గంలో చింతలపూడి-కామవరపుకోట రోడ్డుకు 6.6 కిలోమీటర్లకు రూ.2.60 కోట్లు
- కైకలూరు నియోజకవర్గంలో సిద్ధాంతం-పెదయడ్లగాడి రోడ్డుకు 13.9 కిలోమీటర్లకు రూ.7.80 కోట్లు నిధులు మంజూరు చేశారు.

రాష్ట్ర సుభిక్షం కోసం అమ్మవార్లకు ఆషాఢ సారె

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



బలుసులమ్మకు సమర్పించిన ఆషాఢ సారె వద్ద మంత్రి కొట్టు, కలెక్టర్ ప్రశాంతి, సబ్ కలెక్టర్ సూర్యతేజ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారి ఆలయాల్లో ఆషాఢ సారె సమర్పిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెంలో బలుసులమ్మవారికి దేవదాయశాఖ ఆధ్వర్యంలో సారె సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తొలుత శ్రీశైలంలో కార్యక్రమం ప్రారంభించామని, దేవదాయశాఖ పరిధిలోని ప్రధాన ఆలయాల్లో సారె సమర్పిస్తామన్నారు. శుక్రవారం భీమవరం మావుళ్లమ్మవారికి సారె సమర్పిస్తామన్నారు. గతంలో రాజులు, మహారాజులు ఇటువంటి కార్యక్రమాలు చేసేవారని, ఇప్పుడు సీఎం జగన్ సూచనల మేరకు సంప్రదాయ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర నాయకత్వానికి మరింత బలం చేకూరాలని, అమ్మవారి అనుగ్రహం అందరికీ ఉండాలని, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడి రైతులు పాడిపంటలతో, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబానికి మేలు జరగాలని అమ్మవారిని కోరుకున్నామని చెప్పారు.

చాలా సంతోషం: కలెక్టర్

బలుసులమ్మవారిని కలెక్టర్ పి.ప్రశాంతి దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి దీవెనలు, చల్లని చూపు జిల్లా ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించామన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ అమ్మవారి చరిత్ర, విశిష్టత, ఆషాఢ సారె ప్రాముఖ్యత, అమ్మవారిపై పట్టణ ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కలెక్టర్‌కు తెలియజేశారు. సబ్ కలెక్టర్ సూర్యతేజ్, దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఊరేగింపు

పట్టణంలో అమ్మవారి సారె ఊరేగింపు వైభవంగా జరిగింది. ముందుగా మంత్రి కొట్టు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను శిరస్సుపై ధరించి కాలినడనకు ఆయన ఇంటి నుంచి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. మేళ తాళాలు, కోలాట ప్రదర్శనలు, గరగ నృత్యాలు, కేరళ నృత్య ప్రదర్శనలతో ఊరేగింపు సందడిగా సాగింది.

నానో యూరియాతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఏలూరు(మెట్రో): రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఇఫ్కో కంపెనీ తయారుచేసిన నానో యూరియా, నానో డీఏపీ ద్రవరూప ఎరువులపై గురువారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఇఫ్కో జనరల్ మేనేజర్ ఎం.జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ యూరియా, డీఏపీ బస్తాల స్థానంలో ద్రవ రూపంలో నానో ఎరువులు అందుబాటులోకి వచ్చాయన్నారు. నానో ఎరువుల వాడకంతో పంటల దిగుబడులు పెరగడంతో పాటు పర్యావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. ఏలూరు ఏడీఏ సుబ్బారావు మాట్లాడుతూ నానో ఎరువుల వాడకం వల్ల ఖర్చులు తగ్గించుకోవచ్చని, పంటకు సరైన పోషకాలు అందుతాయన్నారు. నానో యూరియాను జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల్లో అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇఫ్కో ఎస్ఎస్ ఎం.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నానో ఎరువులపై ఇఫ్కో కంపెనీకి పదేళ్ల వరకు పేటెంట్ హక్కులు ఉన్నాయన్నారు. డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ ఏలూరు ఎం.వెంకటేశ్వరరావు, డీఎంఐ మార్కెటింగ్ సీహెచ్ఎల్ డీవీ ప్రసాద్ గుప్తా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల సొసైటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11న నూజివీడులో మినీ జాబ్‌మేళా

నూజివీడు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న నూజివీడులో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీ రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్నో టాస్క్ సొల్యూషన్స్, మోహన్ స్పింటెక్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, దాదాపు 200 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు అర్హత ఉండి 18–35 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. వివరాలకు సెల్ 9652503799, 8374039719 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష

- జిల్లాలోని 161 సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు
- ఇప్పటివరకు 82 వేల సర్టిఫికెట్ల మంజూరు
- 42,669 వినతుల పరిష్కారం
- సర్వత్రా హర్షం



నరసాపురం మండలం కొప్పర్రులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రంలో అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందుకోలేని వారికి లబ్ధిని చేకూర్చడంతో పాటు ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందించే కృతనిశ్చయంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో వడివడిగా సాగుతోంది. రోజూ వేలాది ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో పాటు సమస్యలను పరిష్కరిస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలు స్థానికంగా అందించడం, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటికే వచ్చి సేవలందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

1.25 లక్షల కుటుంబాల సర్వే

పశ్చిమగోదావరి జిల్లాలో 6.4 లక్షల కుటుంబాలు ఉండగా జగనన్న సురక్ష కార్యక్రమంలో మొదటి విడతగా 1.25 లక్షల కుటుంబాల సర్వే పూర్తయ్యింది. ఇప్పటివరకూ 161 సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. 82,601 సర్టిఫికెట్లు మంజూరు చేయగా.. 72,202 మంది లబ్ధిదారులకు వాటిని అందజేశారు. 10,399 ధ్రువీకరణ పత్రాలను అందించాల్సి ఉంది. 44 సర్టిఫికెట్లను వివిధ కారణాలతో తిరస్కరించారు.

48,200 వినతులు

జిల్లాలో 1, 4, 6వ తేదీల్లో ఆయా సచివాలయాల వద్ద జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. మొత్తం 48,200 వినతులు రాగా 42,669 వినతులను పరిష్కరించారు. మిగిలిన 5,531 వినతులను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సర్టిఫికెట్ల జారీ ఇలా..

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవల్లో భాగంగా పలు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారు. ఇప్పటివరకూ కులధ్రువీకరణ పత్రాలు 37,534, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 35,893, ఆధార్ సర్వీసులు 2,349, సీసీఆర్ కార్డుల జారీ 1,973, మ్యూటేషన్ సర్టిఫికెట్లు 17, మ్యారేజ్ సర్టిఫికెట్లు 25, బర్త్ సర్టిఫికెట్లు 36, డెత్ సర్టిఫికెట్లు 26, ఎఫ్ఎంసీ 59, రైస్ కార్డులు 514, హౌస్ హోల్డ్ షిఫ్టింగ్ సేవలు 76 అందించారు.

సులభంగా సర్టిఫికెట్లు



జగనన్న సురక్ష క్యాంపు ద్వారా నేను ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలను సులభంగా పొందాను. సచివాలయాల ద్వారా స్థానికంగానే సేవలు అందుతున్నాయి. గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరిగాల్సి వచ్చేది. సీఎం జగన్ మంచి ఆలోచనతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్థానికంగానే సర్టిఫికెట్లు అందించడం సంతోషం.

– కె.దానమ్మ, 3వ వార్డు, భీమవరం

స్థానికంగానే సేవలు



గతంలో ఏదైనా సర్టిఫికెట్ అవసరమైతే మీ సేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకుని దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లి సర్టిఫికెట్ పనిపూర్తి చేసుకుని మళ్లీ మీ సేవకు వెళ్లి తీసుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు మండల కేంద్రానికి వెళ్లకుండానే స్థానిక సచివాలయం వద్దే నాకు ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్ అందించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యంగా మహిళలకు ఎంతో ఉపయోగపడుతుంది.

– పి.శారద, వేంద్ర

అర్జీదారులకు మెరుగైన సేవలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్ రెడ్డి

జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా అర్జీదారులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. గురువారం జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, రీసర్వే, పంచాయతీరాజ్, వ్యవసాయం తదితర అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జగనన్న సురక్షకు సంబంధించి వచ్చిన అర్జీలకు టోకెన్ రైజ్ చేసి వాటికి సర్వీసు రిక్వెస్ట్ రూపంలో నమోదు చేసి అర్జీదారులకు మెరుగైన సేవలు అందజేయాలన్నారు. దీనిలో భాగంగా ఇప్పటివరకు 15 లక్షల టోకెన్లు రైజ్ కాగా 13 లక్షల సర్వీసు రిక్వెస్ట్ నమోదు చేసి 11 లక్షల దరఖాస్తులను అప్రూవ్ చేశామన్నారు. సురక్ష క్యాంపులు నిర్వహించినప్పుడు ఆయా కార్యక్రమం ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. జగనన్నకు చెబుదాంకు సంబంధించి ఎక్కువ శాతం రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, మున్సిపాలిటీ, హోం శాఖలకు నుంచి దరఖాస్తులు వస్తున్నాయని వాటిని బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా పరిష్కరించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలు సరికాదు



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలు, బాలికలు, యువతులు అనాలోచిత నిర్ణయాలు తీసుకోకుంటే దాడులను నివారించవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏలూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్లను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. బాలబాలికలు తప్పనిసరిగా విద్యనభ్యసించాలని, బాలలతో పనులు చేయిస్తే కఠిన శిక్ష తప్పదన్నారు. మహిళలు, బాలికలను శారీరకంగా, మానసికంగా వేధిస్తే కఠిన చర్యలు తప్పవని, అటువంటి బాధితులు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. మహిళలు, యువతులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. బాధితులకు నష్టపరిహారం, యాసిడ్ దాడికి సంబంధించిన చట్టాల గురించి వివరించారు. ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం పార్వతీదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చినవెంకన్న హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గత36 రోజులకు నగదు రూపేణా స్వామివారికి రూ. 3,70,46,060 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 569 గ్రాముల బంగారం, 11.638 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.1,000, రూ. 500 నోట్ల ద్వారా రూ. 20 వేలు లభించినట్టు చెప్పారు.

భీమడోలులో రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్



భీమడోలు రైల్వేస్టేషన్‌లో లోకోపైలెట్, స్టేషన్ మాస్టర్‌కు కృతజ్ఞతలు చెబుతున్న గ్రామపెద్దలు

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్‌లో రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ ఇచ్చిన నేపథ్యంలో భీమడోలు పరిసర గ్రామాల ప్రజలు, ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. గురువారం వేకువజామున 1.32 గంటలకు రైలు ఆగింది. రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ట్రైన్‌కు స్వాగతం పలికారు. లోకో పైలెట్, స్టేషన్ మాస్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పెద్దలు తుమ్మల ఉమామహేశ్వరరావు, ఈతకోట సుబ్బారావు, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్‌తో పాటు వారికి స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ద్వారకాతిరుమల వెళ్లే భక్తులు, అన్నవరం, వైజాగ్ వెళ్లే వారికి, భీమడోలు పరిసర గ్రామాల ప్రజలకు రాయగడ రైలు ఆపడం ఉపయోగకరమన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల జడ్జిగా వెంకట్రామయ్య

ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన బడేటి వెంకట్రామయ్య కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల జడ్జిగా నియమితులయ్యారని ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి టి.దినేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 17 వరకూ నోయిడాలో యూత్, జూనియర్, సీనియర్ కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయని వెల్లడించారు.

గంజాయిపై ఉక్కుపాదం

- ఏలూరు రేంజ్‌లో 574 మందిపై సస్పెక్ట్ షీట్లు
- తరుచూ అరెస్టయ్యే 14 మందిపై పీడీ యాక్ట్
- రేంజ్ పరిధిలో రూ. 33.89 కోట్ల విలువైన గంజాయి ధ్వంసం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: గంజాయి విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఏలూరు రేంజ్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. విక్రయదారుల నెట్‌వర్క్‌ను బ్రేక్ చేయడమే ప్రధాన ఏజెండాగా, వరుస కేసులు నమోదవుతున్నా పరివర్తన రాని వారిపై సస్పెక్ట్ షీట్లు తెరిచి చట్టాలను మరింత కఠినంగా అమలు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా రవాణా అయ్యే గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టడమే ప్రధాన అజెండాగా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది. రేంజ్ పరిధిలో ఆరు జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో 879 కేసులు నమోదు చేసి రూ.33.89 కోట్ల విలువైన గంజాయిని ధ్వంసం చేయడంతో పాటు 611 వాహనాలు సీజ్ చేసి గంజాయి నెట్‌వర్క్‌ను బ్రేక్ చేశారు. ఇక విక్రయదారులు, సప్లయ్ చేసేవారితో పాటు గంజాయి సేవించిన యువతకు స్పెషల్ కౌన్సిలింగ్ ఇస్తున్నారు. రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో బుధవారం నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైంది.

డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ దిశగా పోలీసులు గంజాయిపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపారు. ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి ఏలూరు రేంజ్ మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణా అవుతుంది. కళాశాల యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు గంజాయి విక్రయాలకు తెరతీశారు. ఈ క్రమంలో 2019 నుంచి వరుస కేసులు నమోదు చేస్తూ పెద్ద ఎత్తున గంజాయి నిల్వలు సీజ్ చేసి ధ్వంసం చేసే ప్రక్రియ పోలీస్ యంత్రాంగం నిరతరంగా కొనసాగిస్తుంది. డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా గంజాయి కేసుల్లో అరెస్టయిన వారు వినియోగదారులు, విక్రయేతరులు, సప్లయర్ల పైన పాత క్రైమ్ రికార్డుల ఆధారంగా సీరియస్ ఫోకస్ పెట్టారు. రేంజ్ పరిధిలోని కాకినాడ జిల్లాలో 183 కేసులు, కోనసీమ జిల్లాలో 70 కేసులు, తూర్పుగోదావరిలో 230 కేసులు, ఏలూరు జిల్లాలో 105 కేసులు, పశ్చిమగోదావరి జిల్లాలో 80 కేసులు, కృష్ణా జిల్లాలో 202 కేసులు ఇప్పటి వరకు నమోదయ్యాయి. రేంజ్ పరిధిలో 600 మంది వినియోగదారులు, 1,200 మంది స్థానికంగా విక్రయించేవారు, 1,150 ప్రధాన సప్లయర్లను గుర్తించారు. కాకినాడ జిల్లాలో వినియోగదారులు, సప్లయర్లు, అమ్మేవారు కలిపి 195 మంది, కోనసీమ జిల్లాలో 329 మంది, తూర్పుగోదావరి జిల్లా 977 మంది, ఏలూరు జిల్లాలో 489 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 342 మంది, కృష్ణా జిల్లాలో 616 మందిని గుర్తించారు. దీంతోపాటు లోకల్‌గా ఉండే గంజాయి నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో బ్రేక్ చేయడమే లక్ష్యంగా పోలీస్ ఆపరేషన్ కొనసాగుతుంది.

574 మందిపై సస్పెక్ట్ షీట్లు

రేంజ్ పరిధిలో 6 జిల్లాలో ఇప్పటివరకు వరుసగా గంజాయి కేసుల్లో నమోదువుతున్న 574 మందిపై పోలీసులు సస్పెక్ట్ షీట్ తెరిచారు. ఇటీవల సెర్ఫ్ ఆపరేషన్ మరింత ముమ్మరం చేశారు. ఒకే వ్యక్తిపై మూడు, నాలుగు కేసులు నమోదైన వారిపైన పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఇంతవరకు 14 మందిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. మొత్తం రూ.33.89 కోట్ల విలువైన 80 వేల కిలోల గంజాయిని ధ్వంసం చేశారు. 611 వాహనాలను సీజ్ చేశారు. ప్రధానంగా పాత కేసుల్లో అనేక పర్యాయాలు అరెస్టయిన వారిపై నిఘా పెట్టి వారు కొత్త నెట్‌వర్క్ మొదలుపెట్టకుండా కట్టడి చేసేలా ఉక్కుపాదం మోపుతున్నారు. దీంతోపాటు ప్రతి పోలీస్ జిల్లాలో డీఎస్పీల నేతృత్వంలో స్పెషల్ టీంలు, డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

పక్కాగా అమలు



రేంజ్ పరిధిలో డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది. పాత కేసుల వారీగా దృష్టి సారించి సుమారు 611 మందిని రేంజ్ పరిధిలో గుర్తించి వారికి పోలీస్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

–జీవీజీ అశోక్‌కుమార్, డీఐజీ, ఏలూరు రేంజ్

జగనన్న పాలనలో మహిళా సాధికారత

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఇంటిని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ పి ప్రశాంతి

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరిట అందిస్తూ మహిళా సాధికారితకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో ఆప్షన్-3లో తొలి విడతగా 35 ఇళ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందాలంటే మహిళలు విద్యుత్‌ను పొదుపుగా వాడాలన్నారు. 300 యూనిట్లు మించితే ప్రభుత్వ పథకాలు అందవనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చి మూడేళ్ళు గడుస్తున్నా లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. 426మంది లబ్ధిదారులకు గాను ఆప్షన్-3లో 126 మందికి ఇంటి నిర్మాణాలను ప్రారంభించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌కు అప్పగించాం కదా... ఎందుకులే అన్నట్లు ఇంటి నిర్మాణాలను వదిలేయరాదని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన బాధ్యతను గుర్తెరగాలన్నారు. మరో 1600 నుంచి 1700 మంది వరకు లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకు 25 నుంచి 30 ఎకరాల వరకు స్థలాలు అవసరం ఉందన్నారు. కోర్టు కేసులు తొలగిపోతే చాలా వరకు ఇంటి స్థలాలను కొనుగోలు చేసే భారం తగ్గుతుందన్నారు. ఇంటి స్థలం ఇచ్చి ప్రభుత్వం ఇంటి నిర్మాణాలు చేపడుతుంటే అదృష్టంగా భావించాలన్నారు. తొమ్మిది నెలల్లో ఎన్నికలు వస్తున్నాయన్నారు. అధికారం కోసం కొంతమంది ఎదురు చూస్తున్నారని.. వారి మాటలు నమ్మవద్దన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అద్దె ఇళ్లల్లో ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణం చేపడుతుందన్నారు. పట్టాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకోవాలన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణాలు ప్రారంభిస్తున్న వారు వచ్చే సంక్రాంతి నాటికి సొంతింటి వారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సూర్యతేజ, జగనన్న సురక్ష ప్రత్యేకాధికారి దాసరి సావిత్రి, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఎంఈ మురళీకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి కె.హరిప్రసాద్, సిటీ మిషన్ మేనేజర్ బీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల విషయంలో జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉపముఖ్యమంత్రిని కోరినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విజయవాడలో కలిసి కొద్దిసేపు జిల్లా అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పెద్ద జిల్లా అని, 48 మండలాలు, 895 గ్రామాలు ఉన్నాయని చెప్పారు. ఇంత పెద్ద జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల విషయంలో జిల్లాకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంచి అవకాశం వచ్చిందని, సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్‌కు సూచించారు. త్వరలోనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటిస్తానని చెప్పారు. అనంతరం మంత్రి బూడి ముత్యాలనాయుడుకి పూలబొకే ఇచ్చి, శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, రాష్ట్ర నాయకులు గేదెల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముదునూరులో చోరీ



ముదునూరు అరుంధతీపేటలో చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్ తదితరులు

పెంటపాడు: పెంటపాడు మండలంలోని ముదునూరు శివారు అరుంధతీపేటలో గురువారం తెల్లవాముజామున భారీ చోరీ జరిగింది. రూ.3 లక్షల నగదు, విలువైన బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురవడంతో ఎస్పీ రవిప్రకాష్ గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి చోరీ సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకొన్నారు. పెంటపాడు ఎస్సై జి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం- భీమవరం రోడ్డులో ముదునూరు శివారు అరుంధతీపేటలో గురువారం తెల్లవారుజామున ఈ చోరీ జరిగినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన కడిపి కనక మహాలక్ష్మి ఇంట్లో రాత్రి సమయంలో దుండగులు తలుపు తెరిచి బీరువా పగులగొట్టి అందులో ఉన్న రూ. 3 లక్షల నగదు, 6 కాసుల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఉదయం కుటుంబసభ్యులు బీరువా తెరిచి ఉండటం గమనించి నగదు, వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు నుంచి క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్, సీసీఎస్ డీఎస్పీ పైడేశ్వరరావు, గూడెం డీఎస్పీ డి. శరత్‌కుమార్ తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యమపాశాలైన విద్యుత్ వైర్లు

- మొగల్తూరు మండలం మోళ్లపర్రులో విషాదం
- విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి



మోళ్లపర్రులో విద్యుదాఘాతానికి గురై ఫెన్సింగ్‌కు అతుక్కుపోయిన మృతదేహాలు



మృతులు తిరుమాని వెంకటేశ్వర్లు, బందన నాగరాజు (ఫైల్ ఫొటోలు)



మోళ్ళపర్రులో మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: వేటే జీవనాధారంగా బతుకుతున్న ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వేకువజామున వేటకని బయల్దేరిన వారిని విద్యుత్ వైర్ల రూపంలో మృత్యువు కబళించింది. ఇంటి పెద్దలు విగతజీవులుగా మారడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ పంచాయతీ మోళ్లపర్రుకు చెందిన తిరుమాని వెంకటేశ్వర్లు (59), బందన నాగరాజు (56) స్థానికంగా ప్రవహించే ఉప్పుటేరులో గురువారం వేకువజామునే వేటకని బయలుదేరారు. ప్రతిరోజూ వెళ్లే దారిలోనే వెళ్తుండగా విద్యుత్ ప్రమాదం జరిగింది. అదే గ్రామానికి చెందిన ఆండ్రాజు కృష్ణ తన మూడెకరాల రొయ్యల చెరువును మరో వ్యక్తికి లీజుకిచ్చాడు. లీజుకు తీసుకున్న వ్యక్తి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి చెరువులోకి నీరు తోడుకునేందుకు విద్యుత్ మోటార్లు వినియోగించుకుంటున్నాడు. బుధవారం రాత్రి వేసిన మోటార్ ఆపలేదు. గురువారం వేకువజామున వీచిన ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగి ఫెన్సింగ్‌పై పడ్డాయి. ఉదయం చెరువు గట్టుపై ముందు వెళుతున్న వెంకటేశ్వర్లు గట్టు మీద కాలు జారి పడబోయాడు. ఆ క్రమంలో వెనుకే వస్తున్న నాగరాజు అతన్ని పట్టుకోబోయాడు. ఇద్దరూ పట్టుతప్పి ఫెన్సింగ్‌పై పడిపోయారు. అప్పటికే ఫెన్సింగ్‌కి విద్యుత్ సరఫరా అవుతుండటంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, నాగరాజుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రభుత్వం తరపున ఆదుకుంటాం

సమాచారం అందుకున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. పోలీస్, రెవెన్యూ అధికారులతోను, మృతుల కుటుంబ సభ్యులతోను మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా రావల్సిన నష్టపరిహారం అందేలా చూడటమే కాకుండా మృతుల కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. వేటకు వెళ్లే దారిని సర్వే చేయించి ఆక్రమణలు తొలగించి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని తహసీల్దార్ జి.అనితాకుమారిని ఆదేశించారు. సంఘటనా స్థలంలోనే మృతదేహాలకు పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించేలా చూడాలని డీఎస్పీ రవి మనోహర ఆచారికి సూచించారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూనీ, నాయకులు ఆండ్రాజు చల్లారావు, కర్రి ఏసుబాబు, పోతుల రమేష్ తదితరులు ఉన్నారు.

దేవుని పట్ల బలమైన విశ్వాసం ఉండాలి

వైఎస్ విమలారెడ్డి



కొడమంచిలి ఎలీమ్ ప్రేయర్ హౌస్‌లో వైఎస్ విమలారెడ్డి, వైఎస్ జయారెడ్డిలను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రతి ఒక్కరూ దేవుడి పట్ల బలమైన విశ్వాసం కలిగి ఉండాలని ప్రముఖ క్రైస్తవ ప్రసంగీకురాలు వైఎస్.విమలారెడ్డి పిలుపునిచ్చారు. ఆచంట మండలం కొడమంచిలిలో నూతనంగా నిర్మించిన ఎలీమ్ ప్రేయర్ హౌస్(భాస్కరరెడ్డి గారి చర్చి)లో జరిగిన కార్యక్రమంలో గురువారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరాధనకు పాస్టర్ టీఎస్ఆర్ ప్రసాదరెడ్డి అధ్యక్షత వహించారు. వైఎస్.విమలారెడ్డి మాట్లాడుతూ దేవుడికి ప్రథమ స్థానం ఇచ్చినపుడే సంతోషకరమైన జీవితాన్ని పొందగలమన్నారు. పవిత్ర హృదయంతో దేవుడిని ప్రార్థించడం ద్వారా ఎన్నో అద్భుతకార్యాలు సాధ్యమవుతాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సోదరుడు వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి సతీమణి వైఎస్.జయారెడ్డి కూడా ఆరాధన కూడికలో పాల్గొని ప్రసంగించారు. ఎలీమ్ ప్రేయర్ హౌస్ వ్యవస్థాపకుడు భాస్కరరెడ్డి సేవలను కొనియాడారు. వైఎస్.విమలారెడ్డి, జయారెడ్డిలకు పాస్టర్ ప్రసాదరెడ్డి, సంఘస్తులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో భాస్కరరెడ్డి సతీమణి మేడపాటి ఇంద్రావతి, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, పాస్టర్లు ఇమ్మానుయేలు, ఫణి, జాషువా, ఏఎంసీ డైరెక్టర్ గంటా గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఎలీమ్ ప్రేయర్ హౌస్ ఆవరణలో 'గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి' సేవాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్.విమలారెడ్డి, వైఎస్.జయారెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ వృక్షాలను పెంచడం ద్వారా ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలని వినతి



కేంద్ర రైల్వే శాఖ మంత్రికి వినతిపత్రం అందజేసిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: తణుకు నియోజకవర్గ పరిధిలో రైల్వే సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మరోసారి వినతిపత్రం అందజేశారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయోగాత్మకంగా ఆరునెలలు పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేసి పరిశీలించాలని కేంద్ర మంత్రిని కోరారు. మంత్రి కారుమూరి వెంట అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఉన్నారు.

యువతిని వేధించిన వ్యక్తి అరెస్ట్



అరెస్టు చేసిన నిందుతుడు నవీన్‌తో పోలీసులు

ముదినేపల్లి రూరల్: ఇన్‌స్టాగ్రాంలో ప్రేమ పేరుతో యువతిని పరిచయం చేసుకుని అసభ్య వీడియోలతో బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని స్థానిక పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై షణ్ముఖసాయి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొమ్మినంపాడుకు చెందిన ఒక యువతి హైదరాబాద్‌లో చదువుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 15న ఇన్‌స్టాగాంలో ఆ యువతికి విజయనగరం జిల్లా జియమ్మవలస మండలం బిట్రపాడు గ్రామానికి చెందిన మిరియాల నవీన్ పరిచయమై ప్రేమిస్తున్నానంటూ సందేశాలు పంపించేవాడు. చనువు పెంచుకొని వీడియోకాల్ చేసి అసభ్యంగా వీడియోలు చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరిస్తున్నాడు. భయంతో ఆ యువతి కొంత నగదు నవీన్‌కు ఇచ్చినప్పటికీ మరింత కావాలంటూ బెదిరించసాగాడు. దీంతో ఈ నెల 4న ఇంటికి వస్తే డబ్బు ఇస్తానని యువతి తెలపడంతో నవీన్ బొమ్మినంపాడు వచ్చాడు. యువతి బంధువులు తల్లిదండ్రులు నవీన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో మండలంలోని సింగరాయపాలెంలో గురువారం అరెస్టు చేసినట్లు చెప్పారు. నవీన్ గతంలో విశాఖపట్నం జిల్లా దువ్వాడ, మువ్వవానిపాలెం, పోతినమల్లాయిపాలెం పోలీసుస్టేషన్లలో ఇదేవిధమైన కేసులపై అరెస్టయి బెయిల్‌పై తిరుగుతున్నట్లు తెలిపారు.

సబ్ కలెక్టర్ చొరవతో మళ్లీ బడికి



అత్తిలిలో చిన్నారులను వెంటబెట్టుకుని పాఠశాలలో చేర్పించడానికి తీసుకువెళ్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

అత్తిలి: రెండేళ్లుగా పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లో ఉంటున్న ఇద్దరు చిన్నారులు నర్సాపురం సబ్ కలెక్టర్ ఎం. సూర్యతేజ చొరవతో స్కూల్‌లో చేరారు. భార్యాభర్తల మనస్పర్థల కారణంగా వానపల్లి మహాలక్ష్మి తన కుమార్తె, కుమారుడితో కలిసి అత్తిలి రైల్వేస్టేషన్ రోడ్డులో పుట్టింట్లో ఉంటోంది. గత రెండేళ్లుగా పిల్లలను పాఠశాలకు పంపకుండా ఇంట్లోనే ఉంచడంతో స్థానికులు మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈవోలు ఎస్.రమేష్, ఎంపీ ఎల్‌కే ప్రసాద్‌లు చిన్నారుల ఇంటికి వెళ్లి పిల్లలను స్కూల్‌కి పంపించాలని కోరినా.. తల్లి అంగీకరించకపోవడంతో వారు వెనుదిరిగారు. గురువారం అత్తిలి పర్యటనకు వచ్చిన నర్సాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ మండలంలో డ్రాపవుట్స్‌పై తహసీల్దార్, ఎంఈవోలను ఆరా తీశారు. దీంతో బడికి రాకుండా ఇంటివద్దనే ఉంటున్న ఇద్దరు చిన్నారుల విషయాన్ని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సబ్‌కలెక్టర్ చిన్నారుల ఇంటికి వెళ్లారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా వారి తల్లిని ఒప్పించారు. దీంతో చిన్నారులు లక్ష్మీనాగ ప్రవల్లిక, సాయికృష్ణను సబ్‌కలెక్టర్ వెంటతీసుకుని దగ్గరలోని ప్రాథమిక పాఠశాలకు తీసుకువెళ్లారు. అక్కడ హెచ్‌ఎంతో మాట్లాడి స్కూల్‌లో చేర్పించారు. వెంటనే వారికి జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. చిన్నారులు ప్రతీరోజు పాఠశాలకు వచ్చేలా విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

సర్పంచ్‌ని బెదిరించిన ముగ్గురిపై కేసు

ద్వారకాతిరుమల: ఒక సర్పంచ్‌ని చంపుతానని బెదిరించిన ముగ్గురు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని కొమ్మర గ్రామ సర్పంచ్ మానుకొండ మణి బుధవారం రాత్రి గ్రామ సమస్యలపై తన ఇంటి వద్ద పెద్దలతో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన గ్రామానికి చెందిన మానుకొండ నాగేశ్వరరావు, మానుకొండ పూర్ణ రామకృష్ణ, మానుకొండ రాజశేఖర్‌లు ఇష్టానుసారం బూతులు తిట్టడంతో పాటు, చంపుతానని బెదిరించినట్టు సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: అనుమానంతో భార్యను వేధిస్తున్న భర్తపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని వేంపాడుకు చెందిన గెడ్డం రమేష్ తన భార్య దీప్తిని అనుమానంతో వేధిస్తున్నాడు. ఆ క్రమంలోనే ఈనెల 3న మధ్యాహ్నం దీప్తిని కొట్టాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీప్తి ఫిర్యాదు మేరకు భర్త రమేష్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంవీఐ డీఎస్ఎస్.నాయక్

తాడేపల్లిగూడెం: విద్యాసంస్థల బస్సులు నడిపే డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని తాడేపల్లిగూడెం మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ డీఎస్ ఎస్.నాయక్ కోరారు. కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రవాణాశాఖ నిబంధనలు, రహదారి నిబంధనలు విధిగా పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. బస్సులు నడిపే డ్రైవర్లు కచ్చితంగా హెవీ లైసెన్సు పొంది ఉండాలన్నారు. ఆ లైసెన్సు సీనియారిటీ ఐదు సంవత్సరాలు ఉండాలన్నారు. డ్రైవింగ్ సమయంలో యూనిఫారం ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు.

దివ్యాంగుల పిల్లలకు విద్యా సామగ్రి కిట్లు పంపిణీ


భవిత సెంటర్‌లో విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 16 మంది దివ్యాంగుల విద్యార్థులకు ప్రత్యేక విద్యకు సంబంధించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అందజేసినట్లు భవిత సెంటర్ నిర్వాహకులు ఎస్‌కే బాలీశ్వరయ్య గురువారం పట్టణంలో వెల్లడించారు. ఈ సందర్భంగా బాలీశ్వరయ్య మాట్లాడుతూ భీమవరం సమగ్ర శిక్షణ కార్యాలయంలో సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ పి.శ్యాం సుందర్‌చే దివ్యాంగుల పిల్లలకు ప్రభుత్వం అందించే విద్యా సామాగ్రిపై అవగాహన కల్పించి, ఈ సమాగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


తణుకులో పాస్టర్స్ ఫెలోషిఫ్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జోషఫ్ రాజు

తణుకు టౌన్: ప్రభుత్వ నిబంధనల మేరకు క్రైస్తవుల స్మశాన వాటికలు, సర్టిఫికేట్‌లు,చర్చి అనుమతులు వంటి సమస్యలు పరిష్కరించాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు కొమనాపల్లి జోషఫ్ రాజ్ కోరారు. గురువారం తణుకులోని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జిల్లా కార్యదర్శి బిషప్ మల్లిపూడి జోహన్నస్ ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జోషఫ్ రాజ్ మాట్లాడుతూ క్రైస్తవుల న్యాయమైన సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొంద రత్నరాజు, కోశాధికారి రాపాక రత్నరాజు, సభ్యులు శ్యామ్‌బాబు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి


రీసర్వే పనులకు సంబంధించి రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

అత్తిలి: రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నర్సాపురం సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ అధికారులను ఆదేశించారు.అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పనులకు రైతులు సహకరించాలన్నారు. రీ సర్వే వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, రీ సర్వే ప్రక్రియ పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీచేసారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఆర్ఐ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండేపాడులో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: మండలంలోని బి. కొండేపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిధిగా పాల్గొనే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కైగాల కోరారు.

వైభవంగా బలుసులమ్మ అమ్మవారి సారె ఊరేగింపు


అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఇలవేల్పు, గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారి ఆషాడ మాసం సారే ఊరేగింపు గురువారం అంగరంగ వైభవంగా సాగింది. ఉపముఖ్యమంత్రి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, ఆయన నివాసం వద్ద నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ, గాజులు, వెండి పళ్లెంలో పెట్టుకొని శిరస్సును ధరించి కాలినడకన ఇంటి నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. దారి పొడవున వేదమంత్రాలతో మేళ తాళాలు, కోలాట ప్రదర్శనలు, గరగ నృత్యాలు, కేరళ నృత్య ప్రదర్శనలతో ఊరేగింపు కోలాహలంగా సందడిగా సాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా శాస్త్రోక్తంగా, సాంప్రదాయబద్ధంగా జరగడంతో పట్టణంలో ఆధ్యాత్మికభరిత ఉత్సాహ పూరిత వాతావరణం నెలకొంది. 100 రకాలు స్వీట్లు, పండ్లు, ప్రసాదాలు, పువ్వులతో భారీగా మహిళలు ఊరేగింపులో పాల్గొనగా మార్గంలో నందిబొమ్మ రామాలయం కమిటీ సభ్యులు, మహిళలు, పాలబుచ్చియ్య వీధి గణేశ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. మంత్రి ఆలయానికి చేరుకొన్న అనంతరం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. భీమవరం మావుళమ్మ టెంపుల్ వేద పండితులు ఈమని సోమయాజులు ఘనాపాటి, అర్చక అకాడమీ డైరక్టర్ చక్రవర్తుల రాజా గోపాలచార్యులు, ఆలయ అర్చకులు బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి తీసుకువచ్చిన సారెని అమ్మవారికి సమర్పించారు. వేదపండితులు కొట్టు సత్యనారాయణ దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, ఆర్‌జేసీ సురేష్ బాబు, బలుసులమ్మ గుడి దేవస్థానం కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, సీజీఎఫ్ కమిటీ సభ్యులు కర్రి భాస్కరరావు, ద్వారకా తిరుముల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ముప్పిడి సంపత్ కుమార్, కొలుకులూరి ధర్మరాజు, ముత్యాలమ్మ గుడి కమిటీ చైర్మన్ మాకా బాలాజీ, పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, దిశ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ రాష్ట్ర కోశాధికారి కె.విజయలక్ష్మి, పట్టణ మహిళా ప్రెసిడెంట్ బోనం విజయ నిర్మల, రూరల్ మహిళా ప్రెసిడెంట్ నూనె రాధ, కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరక్టర్ సంపత్‌రావు లక్ష్మణరావు, ఆలయ కమిటీ సభ్యులు పెదప్రోలు భాస్కర్, వట్టిప్రోలు రాము, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎండోమెంట్ ఇన్స్‌స్పెక్టర్ సుజన కుమార్, దేవస్థానం ఈఓ చీమలకొండ సాయి, సొసైటీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మెంబర్లు, దేవాదాయ శాఖ ఉద్యోగులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని నార్త్ పాతూరు 33/11 కేవీ విద్యుత్ సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. పీ అండ్ టీ కాలనీ ఫీడర్, మహాలక్ష్మినగర్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం మసీద్ రోడ్డు, వివేకానంద బొమ్మ సెంటర్, ఝాన్సీరాణి ఆసుపత్రి ఏరియా, డీఎస్ చెరువు, పాతూరు, మహాలక్ష్మినగర్, చెట్లు రోడ్డు, సత్యవతినగర్ తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టూ టౌన్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు: పట్టణంలోని సౌత్ టూ టౌన్ జయలక్ష్మి థియేటర్ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈనాడు ఫీడర్‌కు సంబంధించి సింగిల్ ఫేజ్ లైన్ నుంచి త్రిబుల్ ఫేజ్ లైన్‌కు మార్పు, కొత్త పోల్స్ వేసేందుకు, ఇతర మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

అమ్మ ఒడి.. ఆనందాల సవ్వడి

- తణుకులో అలరించిన అమ్మ ఒడి సభ
- హాజరైన మంత్రి కారుమూరి, జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- తల్లుల ఖాతాలో నగదు జమ
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


తణుకులో అమ్మ ఒడి కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

తణుకు అర్బన్: పేద విద్యార్థులకు అమ్మ ఒడి పథకం వరంగా మారింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతూ చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు ఈ పథకం ద్వారా బంగారు బాట వేసింది. 2019-20 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకాన్ని క్రమం తప్పకుండా అమలు చేస్తోంది. ఏటా విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.15వేలు ఆర్థిక సాయం జమవుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల చదువులు భారం కాకుండా పూర్తి బాధ్యతలు ప్రభుత్వమే భరించేలా వివిధ పథకాలను ప్రవేశపెడుతూ విద్యార్థుల భవితకు పునాదులు వేస్తుంది. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలను మారుస్తూ కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా సర్కారు బడులను తీర్చిదిద్దుతోంది. ప్రతి విద్యార్థిని ఉన్నతస్థాయికి చేర్చాలనే ధృడ సంకల్పంతో జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం అమ్మలకు అండగా ఉంది. పేద, మధ్యతరగతి వర్గాలకు సంబంధించి ఏ బిడ్డ కూడా చదువు మధ్యలోనే ఆపివేయకూడదనే ఉద్దేశ్యంతో అమ్మ ఒడి పథకం అమలు చేశామని పలు సమావేశాల్లో ముఖ్యమంత్రి చెబుతున్నారు.

నాలుగు విడతల్లో 118.44 కోట్లు చెల్లింపులు

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి ఈ ఏడాది నాలుగో విడతల్లో భాగంగా 81,790 మంది లబ్ధిదారులకు 118.44 కోట్లు నిధులు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో తల్లుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

తణుకులో అలరించిన అమ్మ ఒడి కార్యక్రమం

ఈనెల 4వ తేదీన తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడాప్రాంగణంలో పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న అమ్మ ఒడి కార్యక్రమానికి విద్యార్థినీ విద్యార్థులు, తల్లులు కథం తొక్కారు. సుమారుగా 15వేలకు పైగా విద్యార్థులు, తల్లులు సభకు హాజరుకావడం ఒక చరిత్రగా నిలిచింది. ఈ సభలో మంత్రి కారుమూరి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పలు సలహాలు అందచేశారు. విద్యార్థులంతా జగన మామ అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని విద్యాభ్యాసం చేయాలని సూచించారు.

తణుకు నియోజకవర్గంలో నాలుగేళ్ల అమ్మ ఒడి చెల్లింపులు ఇలా...

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు
2020	22420	33.63 కోట్లు
2021	14862	22.29 కోట్లు
2022	22898	34.34 కోట్లు
2023	21610	28.18 కోట్లు

నేడు తణుకు నియోజకవర్గంలో అమ్మ ఒడి...

తణుకు నియోజకవర్గంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఇరగవరం మండలం ఇరగవరం హైస్కూల్‌లోను, ఉదయం 10 గంటలకు అత్తిలి మండలం అత్తిలి హైస్కూల్‌లో జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం అధికార యంత్రాంగం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

జునోసిస్ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలి


కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె నరసింహారావు

అత్తిలి: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల జంతు ప్రేమికులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె నరసింహారావు అన్నారు. గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో, లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి వారి సహకారంతో అత్తిలి పశువైద్యశాలలో శునకాలకు ఉచితంగా యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ జునోసిస్ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని జంతు ప్రేమికులకు సూచించారు. ఈకార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేతనాగరాజు, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శింగులూరి వెంకట సత్య చంద్రశేఖర్, బీటీకే ప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శంకరభావన్నారాయణ, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే జీవిత లక్ష్యాలను సాధించుకోవాలి


విద్యార్థులకు సూచనలు అందజేస్తున్న జిల్లా మానసిక ఆరోగ్య విభాగం సైకాలజిస్ట్ కె శ్రీనివాసరావు

అత్తిలి: విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించడానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని జిల్లా మానసిక ఆరోగ్య విభాగం సైకాలజిస్ట్ కె శ్రీనివాసరావు అన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గురువారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పది పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం అవడం, సమయపాలన, ఒత్తిడిని జయించడం వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సెల్‌ఫోన్, స్మోకింగ్, డ్రింక్ చేయడం వంటి దురలవాట్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఏవైనా మానసిక సమస్యలు ఉంటే 14416 నంబర్‌కు ఫోన్‌చేసినట్లయితే ఆన్‌లైన్‌లో కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15 లోగా హాస్టల్‌ను మార్పు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను గురుకుల హాస్టల్‌ను కొత్త భవనాల్లోకి ఈ నెల 15వ తేదీలోపు మార్పు చేయాలని, లేకుంటే జిల్లా కలెకర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని విద్యార్థి సంఘ నాయకులు హెచ్చరించారు. గురువారం మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, కేఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్‌రాజు, పీకేఎస్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మస్తాన్‌లు మాట్లాడుతూ నూతన భవనంలోకి విద్యార్థులను మార్చడానికి ఐదు నెలలుగా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 15వ తేదిలోగా మార్చకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి దిద్దే నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు యు.మురళీ, పి.అనిల్, డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కారుమూరికి ఎన్జీవోల ఆత్మీయ సత్కారం

తణుకు టౌన్: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ కేబినెట్ నిర్ణయించడాన్ని హర్షిస్తూ ఈనెల 7వ తేదీన ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నట్లు తణుకు తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌వీ నరసరాజు, కేవీ సత్యనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తణుకు పట్టణంలోని ఎన్జీవో హోంలో నిర్వహించే ఈకార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కేవీ శివారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చోడగిరి శ్రీనివాసరావు, నెరుసు రామారావు, జేఏసీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ హరనాథ్‌లతో పాటు వివిధ శాఖల, ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

పేదల ఆర్థిక స్థితి మెరుగుపడేలా పథకాలు


తణుకు టౌన్: వేల్పూరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ్

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, వారు ఆర్థికంగా నిలదొక్కేకునేందుకు అండగా నిలుస్తున్నారని, జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు కోరారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం బి. కొండేపాడు, మౌంజీపాడు గ్రామాల్లో తహసీల్దార్, ఎంపీడీవోల ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఏవీఆర్‌వీ ప్రసాద్, సర్పంచ్ కట్టా దానయ్య, ఎంపీటీసీ సభ్యులు దేవరశెట్టి సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు మద్రే కృష్ణమూర్తి, వద్రే శివరామకృష్ణ, కట్టా దానయ్య, గృహసారథులు, గృహకన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు. మౌంజీపాడు గ్రామంలో మండల గృహసారథుల కన్వీనర్ మైలవరపు పెదబాబు, సర్పంచ్ మైలవరపు స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యులు నంద్యాల వెంకన్నబాబు, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఆర్‌ఐ కనకదుర్గ, పార్టీ నాయకులు, రెండు టీం సభ్యులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

అత్తిలి: ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ అన్నారు. గురువారం అత్తిలి-2 గ్రామ సచివాలయం, ఆరవల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ గంటావిజేతనాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఆరవల్లి సర్పంచ్ వెలగల సుస్మిత, ఉపసర్పంచ్ వెలగల అమ్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పెన్మెత్స రామరాజు, ఎంపీటీసీసభ్యురాలు దొమ్మేటిరమ్య, సబ్బితి రాజేష్, యడ్లపల్లిదుర్గారావు, ఎమ్మెల్వో వెలగల విజయభాస్కరరెడ్డి, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో వీవీపీఎస్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా కృషి చేయాలి

తణుకు టౌన్: ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి చేస్తున్న కృషితో బడిఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండేలా ప్రతీ ఒక్కరూ భాద్యత వహించాలని నరసాపురం సబ్ కలెక్టర్ యం. సూర్యతేజ్ చెప్పారు. గురువారం తణుకు రూరల్ మండలం వేల్పూరు, దువ్వ గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో వివిధ సబ్జెక్టులు తప్పిన విద్యార్థినీ, విద్యార్థులు మరలా పాఠశాలలకు వెళ్లి పదో తరగతి చదివే సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషకుమారి, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైఎస్సార్సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సున్న దుర్గాప్రసాద్, గ్రామ కార్యదర్శి వీ గంగాధరరావు, సచివాలయాల అధ్యక్షుడు కరిబండి రాజేష్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష

ఇరగవరం: ప్రజా సమస్యల పరిష్కారనికే జగనన్న సురక్ష కార్యక్రమం అని జిల్లా వ్యవసాయ అధికారి, నియోజక వర్గ ప్రత్యేక అధికారి జెడ్ వేంటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పేకేరు, ఏలేటిపాడు గ్రామాల పరిధిలో జగనన్న సురక్షకు సంబంధించి గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, ఎపిపి వెలగల సాయిబాబా రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, అదికారులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం జగనన్న సురక్ష

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరి ప్రజలకు ఒక వరం జగనన్న సురక్ష కార్యక్రమం అని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నీలాద్రిపురం, ఆరుగొలను గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, పీతల బుచ్చిబాబు, ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, కార్యదర్శులు పవన్‌కుమార్, శ్రీనివాస చంద్రరాజు, గట్టిం నాగేశ్వరరావు, ప్రేమవతి, అడపా అప్పలరాజు, సచివాలయ కార్యదర్శులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తణుకు అర్బన్:అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపనే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు అన్నారు. తణుకు 7,8,9 సచివాలయాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, డోలా సింహాద్రి, కుడుపూడి చంద్రరావు,మునిసిపల్ అధికారులు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమానికి లబ్ధిదారులు హర్షం

తాడేపల్లిగూడెం అర్బన్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్థానిక 7, 8, 9 వార్డులకు సంబంధించి బలుసులమ్మ కల్యాణ మండపంలో ప్రత్యేక అధికారి దాసరి సావిత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులకు సంబంధించిన ప్రజలనుంచి గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది సేకరించిన దరఖాస్తులకు ధ్రువపత్రాలను అందజేశారు. మూడు వార్డులకు సంబంధించిన సురక్ష సమావేశాలను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, ఏఎస్ఓ సురేష్‌లు పర్యవేక్షించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు అందరికి ధ్రువపత్రాలను అందచేశారు.


తాడేపల్లిగూడెం రూరల్: నీలాద్రిపురం గ్రామంలో అర్జీదారులకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ దుర్గాకిషోర్, సర్పంచ్ లక్ష్మణరావు



ఇరగవరం: పేకేరులో జగనన్న సురక్షలో మాట్లాడుతున్న నాయకులు,అధికారులు

బాబూజగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం


మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చీర్ల రాధయ్య, పద్మశ్రీలు

తణుకు టౌన్: భారత దేశ ఉపప్రధానిగా, సంఘ సంస్కర్తగా దళిత, బలహీనవర్గాల హక్కులు, అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు చీర్ల రాధయ్య కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చీర్ల రాధయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగాన్ని ఖచ్చితంగా అమలు చేసిన మహోన్నత నాయకుడు జగ్జీవన్‌రామ్ అని అన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అణగారినవర్గాల అభివృద్ధి ప్రదాత

తాడేపల్లిగూడెం (టీఓసీ): అణగారిన వర్గాల అభివృద్ధి ప్రధాత జగ్జీవన్‌రామ్ అని పలువురు బీసీ నాయకులు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఆధ్వర్యంలో బహుజనుల అభివృద్ధి ప్రదాత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని గురువారం పట్టణంలో నిర్వహించారు. బీసీ నాయకులు వర్దనపల్లి కాశీ, కేశవభట్ల విజయ్, తుమరాడు చిన్నా తదితరులు పాల్గొన్నారు.